## 5

# రామదర్శనలాలసా...

సరిగ్గా ఆఫీసు విడిచే సమయానికి, అంటే అయిదుగంటలవేళ జానకి ఆఫీసు బయట ఆవరణలో బంగారు ఆకుల చెట్టుక్రింద పదిహేను నిమిషాలు నిలుచుంటుంది. ఆమె కళ్ళు ఎవరికోసమో వెతుక్కుంటాయి. కొద్దిరోజులుగా ఆమె కిదొక అలవాటైపోయింది. దినచర్యలో ఒక భాగంలా. ఆ తరువాత కొద్దిసేపు అటూ ఇటూ చూసి, వస్తూన్న నిట్టూర్పువి అణచుకొని బస్‌స్టాప్ వేపు నడుస్తుంది. ఆ చెట్టుకింద నిలుచున్నంతసేపూ ఆమె కళ్ళలో దిగులు పూలు పూస్తుంది. బస్‌స్టాండ్‌దగ్గర ఆమె పెదవులపైన వాన కురిసి వెలసిన తరువాత నీరెండలా చిరునవ్వు. ఎందుకో ఆమెకే తెలీదు.

సింధ్ నేషనల్‌బాంక్‌లో అశోకవృక్షం వున్నది. ఆ ఆఫీసులో చేరిన తరువాత ఆ విషయం జానకికి దర్వాను లక్ష్మణ్‌సింగ్ చెప్పాడు.

ఫాల్గుణమాసంలో తళతళా మెరుస్తున్న ఆ శింశుపావృక్షపు ఆకులను జానకి కళ్లు విప్పార్చుకుని చూసేది-ఆఫీసుకు వచ్చేటప్పుడు, వెళ్ళేటప్పుడు.

ఇవాళా చూస్తున్నది. అయితే దిగులుగా. ఈ సర్వప్రపంచం తనకు అడ్డుగా నిలిచినట్లు, సానుభూతి చూపనట్లు ఏమిటో కసి. ఎందుకో దిగులు. పిచ్చివాడు. పారిపోయినాడు. అటువంటివాణ్ణి తను ఒళ్ళో యెలా సమాశ్వాసించగలదు! అయినా అంత బలహీనుణ్ణి ఒళ్ళో లాలించడం యెంత అందమైన విషయం. అతని బ్రతుకు

యావత్తునూ తాను శాసించగలిగేది కదా. పిచ్చివాడు. పారి పోయాడు....

తన రెండు కళ్ళూ పోతే బావుండును.

వాటికోసమేగా అతడు పిచ్చివాడైంది?

అన్నాడూ "కళ్ళజోడు పెట్టుకునే ఆడవాళ్ళను చాలామందిని చూశాను. అబ్బ! ఇంత అందమైన కళ్లు ఎప్పుడూ చూడలేదు."

అప్పుడు "షటప్! మైండ్, యువర్ బిజినెస్." వెధవ ఇంగ్లీషు! ఎంత విలవిలలాడిపోయాడు! ఒళ్ళు మండుకపోయేది. మండిపోయినా బాగుండును. అందుకోసమేగా అతను పిచ్చివాడైంది. పిచ్చివాడు. పారిపోయాడు.

'శని' అని ఎన్నిమాట్లు ముఖంమీదనే విసుక్కుంది?

అన్నప్పు డల్లా "నా పే రదేం కాదు. రామారావు." అనేవాడు.

"సంతోషించాం తెలివితేటలకి."

"నా కెందుకో దుఃఖంగా ఉంది."

"జేబురుమాలు ఇవ్వనా?"

"పోనీ, అదేనా ఇవ్వు. జ్ఞాపకంగా వుంచుకుంటాను."

కనీసంఅదేనా ఇవ్వలేదు. పిచ్చివాడు.ఎక్కడున్నాడో? తలచు కుంటే గుండెలో లక్ష కత్తులు దిగినట్లు.'నువు రా! ఇక నాకేమీ వద్దు. గుండెల్లో దాచుకుంటాను. ఎక్కడికీ పోనివ్వను. నువ్వు ఎట్లా చెబితే అట్లా వింటానమ్మా. నా బంగారుకొండవుకదూ! నిన్ను పొందటానికి....లాభంలేదు. దేవుడు అడ్డు వచ్చినా సరే....ఎక్క డున్నావు? పిచ్చివాడు.

పారిపోయాడు.

ఎవరు పిచ్చివాడు?

నేను పిచ్చిదాన్ని. నన్ను పిచ్చిదాన్ని చేశాడు.

"ప్రేమంటే ఇంత బాధని నాకు తెలియదు రామం. నాలోని- ఎక్కడో నిద్రపోతున్న అంతశ్శక్తులను యెందుకు మేల్కొలిపా వమ్మా, నన్ను నేను తెలుసుకున్నప్పటికి ఎందుకు పారిపోయావు?

ఎంత పిరికివాడవు, ఎంత పిచ్చివాడవు! ఎప్పు డొస్తావు? నాకు తెలుసు. ఈ చెట్టు కిందికి వచ్చి కాసేపు నిలుచుని పోతావు. ఏ బస్‌లోనో కనబడతావు. ఏ సినిమాహాలు ద్వారంలోనో కనబడ తావు. నాకు తెలుసు. నా హృదయం చెపుతున్నదమ్మా! వచ్చి నన్ను సర్వనాశనం చేయకు. ఒంటరిగా రా! ఎవరినీ వెంటబెట్టుకుని రావద్దు. నీ కోసం ఈ కళ్ళ వెలుగును ఇలాగే వుంచుతాను. రామం, నా బ్రతుకును నీ పాదాలక్రింద పరుస్తాను. ఎంతదూరాన వున్నావో? నీ ప్రక్కన కూచుని, నా చేతితో చేసినవి యేవైనా నీకు తినిపించా లని వుంది. నువు వచ్చి నన్ను ఎన్నైనా అను, పడతాను. నువు రావా? వస్తావు. నన్ను ఏకాకిని చేసి, నువ్వూ ఒంటరిగా యెక్కడో- మన వూరుగాదు, స్థలంకాదు ఎందుకు వెళ్ళిపోయావు? అక్కడైనా నిన్ను యేడిపించేందుకు యెవరుంటారు చెప్పు. నిన్ను చికాకుపరిచేం దుకు ఎవరుంటారు చెప్పు. అందుకే వచ్చేయ్. ఇంకా....నీకు జ్వరం వస్తే నిన్నెవరు వోదారుస్తారు? ఆకలవుతే కనుక్కునేందుకు యెవ రున్నారు? నేను చచ్చిపోయినానా అమ్మా. మరి రావేం?

పాపిష్ఠిదాన్ని. ఎంతదూరాన వున్నావో, నీ మనసుకి నన్ను తలుచుకుంటే సంతోషం కలగదు కదా!

ఎప్పుడేనా నీ మనసుకు సంతోషం కలిగించేమాట ఒక్క పైనా చెప్పానా, లేదు. నాకు తెలుసు.

అందుకే మరి ఇక నువ్వు రావేమో!

నువ్వు ఎన్నిమాట్లు చెప్పావు, నేను అందమైనదాన్ననిః అందమైనదానవని.

నీకుమాత్రమేం! నువ్వూ అందమైనవాడివే.

పాపిష్ఠిదాన్ని ఆ మాటే చెప్పలేకపోయాను. ఆ మాటే చెప్పి వున్నట్లయితే నువ్వు ఎక్కడికీ వెళ్ళేవాడివి కావు.

పాపిష్ఠిదాన్ని నిన్ను పోగొట్టుకొన్నాను. నన్ను నేను తెలుసుకోలేదు. 'అతిశయ చపలా' అన్నావు.

"కథలు రాసుకో. మంచి మంచి మాటలు వస్తున్నాయి. త్వరగా పైకి వస్తావు." అన్నాను.

"నా బ్రతుకే ఒక కథైంది." అన్నావు.

విషాదాంతమా. సుఖాంతమా? ఆ విషయంలో నిర్ణయం నాది. అప్పట్లో నేను గ్రహించలేకపోయాను. ప్రస్తుతానికి విషాదాంతమే. నీ కథే కాదు. నా కథకూడా. ఎప్పుడో సూర్యోదయమవుతుందని ఈ చీకట్లో యెంతసేపని కూచోను. అయినా నాకు నమ్మకమే. నేను గుచ్చుతున్న యీ పూలమాల నీకు తప్ప అర్పించను. లేకపోతే నా మెళ్ళోనే వాడిపోతుంది. ఎప్పుడో మండిపోతుంది. అప్పుడో స్తే నీకేం దొరుకుతుంది? బూడిద! ఛీ. ఛీ, ఆర్నెల్లు సావాసం చేస్తే వారు వీరవుతారట. వీరు వారు కారేమో. నిరాశ అన్నది నాకీ జన్మకు లేదు. అటువంటిది నాక్కూడా నిరాశ కలుగుతున్నది. ఎందుకంటే నీమీద ఆశ.

నన్నెందుకు ప్రేమించావు? ఏం పొందగలిగావు? నీమీద నాకు కోపంగా వుంది. నామీద కసిగా వుంది.

ఒంటరి రాత్రిళ్ళు. ఛీ, ఛీ, కన్నీళ్లైనా రావు. ఎక్కడో రైలు కూత వినపడుతుంది. నువ్వే గుర్తు వస్తావు. ఈ ఆఫీసులో ఉద్యోగం మానేస్తాను. బొత్తిగా పని చేయకుండా వున్నాను. ఎప్పుడూ నువ్వే జ్ఞాపకం వస్తావు.

మొన్నను అశోకవృక్షం ఎలెక్ట్రిక్ తీగెలకు అడ్డం వస్తున్నదని కొట్టేస్తామన్నారు. ఆఫీసులోనే అందరిముందరా ఏడ్చాను. తెలుసా? ఎందుకనుకున్నావు? ఏడుపును మరచిపోయి యెన్నాళ్ళైందో? మళ్ళీ యేడ్చాను. అమ్మపోయిన తరువాత ఎప్పుడూ యేడవలేదు. మరి అటువంటిది ఎందుకు ఏడ్చానో, తెలుసా? ఈ చెట్టు కిందనే నువు నాకోసం ఆఫీసు విడిచిపెట్టి వచ్చి కాచుకునేవాడివి.నన్ను విసిగించేవాడివి.ప్రేమించేవాడివి. నేను నిన్ను బాధపెట్టేదాన్ని. అంతలా ఏడిస్తే ఆఫీసులో అందరూ ఆశ్చర్యపోయినారు.చనువున్న వాళ్లెవరో అడిగితే, ఇవాళ మా అమ్మపోయినరోజు, అందుకని ఆమె జ్ఞాపకానికి వచ్చి ఆపుకోలేక యేడ్చాను అని చెప్పేను. ఎవరు ఏమనుకొన్నారో నా కెందుకు! ఆఫీసరుగారు పిలిచారు....ఆయన ఏమం

టారో అని భయపడుతూనే వెళ్లాను. ఆయనకు నాన్నగారంటే అమితమైన అభిమానం. నీకు తెలుసు. నన్ను చదివించింది ఆయనే. లేకపోతే నాన్న యేం చదివిస్తాడు? తల్లిలేని నలుగురు పిల్లలతో! రోగిష్ఠివాడు! ఆఫీసరుగారు అడిగారు. ఎంతో చనువుగా, మంద లింపుగా, అభిమానంగా, వాత్సల్యంతో. ఆయనకు కూడ అలానే చెప్పాను.ఆయన నమ్మలేదు."మీ అమ్మపోయింది మేలో కదమ్మా" అన్నారు. నాకు సిగ్గయింది. దుఃఖం వచ్చింది. ఆయనకు యెలా చెప్పను, నిన్ను ప్రేమిస్తున్నానని! ఆ చెట్టుకింద నీతో అర్నెల్లు మాట్లాడానని ఆయనకు యెలా చెప్పను? ఎలానో చెప్పాను. సిగ్గు విడిచి, లజ్జ విడిచి. అభిమానం విడిచి, చచ్చిపోయి.

నా బ్రతుకు బట్టబయలయింది. ఎలా! నువు రావా!? ఆఫీసరు గారు ఆ చెట్టు కొట్టేసేందుకు వప్పుకోలేదు. ఎలెక్ట్రిక్ తీగలు చుట్టూ తిరిగి వచ్చినయ్. ఇకనైనా నువు రావూ! నేను ఒంటరిదాన్ని. సిగ్గు విడిచి నీపేరు చెప్పానే! ఆఫీసరుగారు ఏమనుకున్నారో! ఈ ఆఫీసు విడిచిపెట్టిపోతే,ఇంకోచోట ఉద్యోగ ప్రయత్నం చేసి పొందితే నువు వచ్చి వెతుక్కుంటావేమోనని నేనుపోలేను. నేను నిన్ను తమాషా కోసం చీకాకుపరిస్తే నువు నన్ను యేడిపిస్తున్నావు. నువు అందమైన దానివి, అందమైనదానివి—అని పదేపదే యెందుకు చెప్పావు? ఆ అహంకారంతోనే నేను నిన్ను తృణీకరించాను. పోనీ, నాన్న అయినా చెప్పవచ్చునా? నువ్వైనా చెప్పవచ్చునా? నాన్నను అప్పు డప్పుడు కలుస్తూవుండేవాడివని నాన్న చెప్పేవాడట కదా! "అంతా దాని ఇష్టం. ఇందులో నా జోక్యం రవ్వంత కూడ ఉండదు." నాన్న ఎందుకు చెప్పకూడదూ? వాళ్ళందరికీ ఎవరికీ నా మీద నిజమైన అభి మానంలేదు. స్వార్థం తప్ప. నా ఒక్కడికే నిజమైన అభిమానం ఉన్నది నాపైన. నాన్న చెప్పేడు. తరువాత నువు వెళ్ళిపోయిన తరువాత, సర్వం శూన్యమైన తరువాత. అప్పుడు నిన్ను యెక్కడ వెతకి పట్టుకోను? ఎలా చెప్పను?

అందరిలానే నువ్వూ ప్రబుద్ధుడి వనుకున్నాను. నీ కళ్ళకు

బాగున్నంతమాత్రాన నాతో మాట్లాడుతూ, నన్ను కోరుకుంటున్నా వనుకొన్నాను. రామం, నువు లేకుండా నే నెలా బ్రతకను? నువు ఎక్కడున్నావు? పోనీ ఒక ఉత్తరం వ్రాయకూడదూ! ప్రేమించాడట, ప్రేమించాడు. పేద్ద! నువ్వూ దొంగవే. నిజంగా ప్రేమిస్తే నన్నెట్లా విడిచిపెట్టి వెళ్ళావు? నే నెవరిసొత్తునూ కానే. తీసుకుని వెళ్ళలేక పోయావూ!? నీది కానిది యేదైనా ఉన్నదా? నువు దొంగవు. నువు మంచివాడవు కాదు. నువు ప్రేమించా ననుకొన్నావు. నాకు డబ్బు ఇస్తే సరిపోతుం దనుకున్నావా?

చచ్చిపోయినా పైన తాజ్‌మహల్ కట్టుకోనా? నువు లేక పోయిన తరువాత నా కివన్నీ ఎందుకు? ఎవరైనా అబద్ధాలైనా కల్పించి నీకోసం నేను చచ్చిపోయానని నీతో చెబితే బావుండును. నువు యేడుస్తావు. నాలుగురోజులు అన్నం నీళ్ళూ మానేస్తావు. అంత కసిగావుంది నాకు. నువు మాటాడేదంతా నిజమనుకోలేదు. నిజం చెప్పద్దూ, ప్రేమమీద నాకు నమ్మకంలేదు. నా అనుభవంలో నాకు ఎన్నో విషయాలు తెలుసు. అదీకాక నా బాధ్యత యిన్ని ఆలోచిం చేందుకు యెప్పుడూ వ్యవధానం కలిగించలేదు. పైన ప్రేమంటే ఎక్కడలేని అసహ్యమున్నూ. నా కో స్నేహితురాలు ఉన్నది. ఎవ రినో నిజంగానే ప్రేమించింది. అతణ్ని పొందలేదు. ఎవరో అదృష్ట వంతుడు ఆమెను పొందాడు. ఆమె ఏ మనుభవించింది? ఒక నరకం. మనమంతా మనుష్యులం. ఈ కోరికలూ, లాలసత్వమూ, దుఃఖమూ, దిగులూ, యెందు కనుకున్నాను. అందుకే నిన్ను హేళనచేశాను. ఇప్పుడు నరకం అనుభవిస్తున్నాను. పరలోకం ఉన్నదో లేదో, అక్కడ నరకం అనుభవిస్తామో అనుభవించమో తెలీదు. ఇవాళ నిన్ను తలచుకుంటే యీ బాధ, ఎవరికి చెప్పుకోను?

నువు రావు.

ఆ తప్పు నాది.

వచ్చావు. ఆవాళ అయిదు కాకముందే వచ్చావు. నీకు గుర్తుందా? ఒకరోజున నువ్వు ఏదో మాట్లాడుతున్నావు. జేబురుమా

లుతో అదేపనిగా ముఖం తుడుచుకుంటున్నావు. నా సాన్నిధ్యంలో నిలుచోగానే ఎందుకంత పసివాడవై పోతావు? ముఖం కందిపోయింది. కళ్లు ఎర్రపడతవి. మాటలో తడబాటు వస్తుంది. నా ముఖంకేసి ధైర్యంగా చూడనేలేవు. అలాంటిది నన్ను ప్రేమిస్తున్నానని చెబితే నవ్వక ఎలా ఉండగలను? ఇదేం ప్రేమ! గట్టిగా కసురుకుంటే ఏడ్పు వస్తుందే! నేనంటే అంత భయం. ఇది ప్రేమా! అందుకే నువ్వంటే నాకు అపహాస్యం.

నాకు నవ్వొచ్చింది ఆవాళ.

"పన్నెండు" అన్నాను. నువు తడబడిపోయావు.

"నేను చెప్పేదంతా నిజమనీ, నిజ్జమని నీకు యెలా చెప్పాలో నాకు తెలీకుండా ఉంది." అన్నావు.

"మరేం ఫరవాలేదు." అన్నాను.

"పదమూడూ........" అన్నాను. భయపడిపోయినావు.

ఎందుకో సిగ్గుతో కందిపోయినావు.

పధ్నాలుగూ అన్నాను, పకపకా నవ్వుతూ.

నీ ముఖం ఎంత దీనంగా అయిపోయిందో!

"పదిహేనూ...." అన్నాను. నీ కళ్ళలో ఏమిటో నిస్సహాయతను చదివాను.

"పదహారూ...." అన్నాను. 'ఏమి'టన్నావు చిరాకుగా. నాకు నవ్వొచ్చింది.

"నిట్టూర్పులూ ...." అన్నాను. నువ్వు దిగులుగా నవ్వకుండా ఉండలేకపోయావు.

నువ్వు వెళ్ళిపోయేరోజున మాటమాత్రం నాతో అనకూడదూ! అవును, వందసార్లు చెప్పావు. లక్షసార్లు చెప్పావు. నేనే విని పించుకోలేదు. అవును నాకు మంచి శిక్ష.

ఆవాళ ముందుగానే వచ్చావు.

నేను నవ్వాను. నిలుచుండిపోయాను. బాగా కాలక్షేప మయి పోతున్నది. ఖరీదులేని వినోదం.

"నేను వెళ్ళిపోతున్నాను. రేపటినుండి నాకు యీ బాధ ఉండదు." అన్నావు. "నిజమా?" అన్నాను. నా కళ్ళలోకి ఆశ వచ్చింది. అయినా నిరాశగా "అవును. ఇవాళే రిజిగ్నేషన్ యిచ్చేశాను." అన్నావు.

ఎందుకన్నాను. "ఇలా బ్రతకలేక!" అని నీ సమాధానం. "ఏ మొచ్చింది?" చిరాకుగా అనేసి నాలిక్కొరచుకున్నాను. నా చనువుచూసి నువ్వు నవ్వావు.

"ఏమీ రాకనే...." అన్నావు. అవాల్టి నీ ముఖాన్ని నే నెలా మరచిపోను? అవాళ నిన్నుచూసి నా క్కూడా ఎక్కడో దిగులయింది.

"ఇంతకన్నా మంచి ఉద్యోగం ఎక్కడో దొరికిఉంటుంది." అన్నాను. నువ్వు దిగులుగా నవ్వావు.

"నీ కర్థమయేది అంతవరకే" అన్నావు.

"వెళ్ళు. వెళ్ళదలిస్తే నాకు చెప్పటం దేనికి?"

"నిజమే...." కాసే పాలోచించి "రేపటినుండి నీకు ఈ పీడ ఉండదు కదూ అని"

నేనేం మాట్లాడలేదు.

"ఒక్క టడుగుతాను........"

"ఏమిటో...."

"ఎప్పుడేనా నన్ను గుర్తుచేసుకుంటావా? మీ వారితో చెప్పి నవ్వుకుంటావు కాబోలు...బాగా ఏడిపించానని."

"ఛట్........"

"నాకు తెలుసు. ఎప్పుడో అప్పుడు గుర్తురాకుండా ఉండను. అప్పుడు ఎక్కడ ఉంటానో? మళ్ళీ యీ వేపుకు ఈ జన్మకు రాను...."

"అన్నీ కోతులు........"

"నువ్వు రమ్మన్నావని మనసున అనుకుంటే ఎప్పుడేనా వస్తానేమో!"

"నేనేమీ రమ్మనను."

"నాకు తెలుసు."

అవాళ రోజుటిలా నువు తడబడలేదు. కళ్ళు ఎర్రబడి పోలేదు. ముఖం కందిపోలేదు. నవ్వుతూ ఉన్నావు. ఇంటికి వెళ్ళిన తరువాత నిన్ను తలచుకుంటే నాకూ ముచ్చటైంది.

రెండుచేతులూ యెత్తి నమస్కారం పెట్టావు. పాపిష్ఠిదాన్ని. నాకు నవ్వొచ్చింది.

నువ్వు వెళ్ళిపోతున్నావు.

"ఇదిగో...."

తిరిగివచ్చావు. ఎంత తృప్తి. నీ కళ్ళలో.

"పోనీ ఇక్కడే వుండిపోరాదూ."

"ఇది జాలి. ఇది నాకొద్దు."

"కాదు. ఉన్న ఉద్యోగం పోగొట్టుకొని, మళ్ళీ ఇంత ప్రయత్నం...."

"ఇది దయ. నాకొద్దు."

"అథవా ప్రయత్నంచేసినా ఉద్యోగం యెక్కడ దొరుకుతుంది? ఇప్పుడు చేస్తున్నది మంచి ఉద్యోగమే కదా!"

"ఇది స్నేహం. ఇదీ వద్దు...."

"కాదండీ సీరియస్‌గా చెపుతున్నాను, నా వల్లనే అవుతే మన్నించండి. తమాషాకు యేదో మాట్లాడుతుంటాను. జీవితంలో మొనాటనీ తగ్గేందుకు...."

"ఇది మర్యాద. నాకేమీ వద్దు."

"మరేం కావాలి?" కోపంగా అడిగాను.

"ప్రేమ!" అన్నావు ప్రాధేయపడుతున్నట్లు.

"నాకు నమ్మకంలేదు" అన్నాను.

నువు వెళ్ళిపోయావు. ఎందుకో దిగులైంది. మంచి తమాషా అనుకున్నాను. తృప్తి కలగలేదు. భలేభలే తమాషా అనుకొన్నాను. మనస్సు మూలిగింది. పకపకా నవ్వబోయాను. ఏమిటో విషాదం. నాకేసి చూసుకున్నాను. రామం కనిపించాడు. గేటు దాటుతున్న రామంకేసి చూశాను. నేను కనిపించాను. బాంక్ పైఅంతస్తు గోడ

పక్కగా ఎర్రని సూర్యకిరణాలు దూసుకుని వచ్చి అశోకవృక్షం ఆకులపైన మెరుస్తున్నాయి. ఒకటి రెండు కిరణాలు ఆకుల సందుల గుండా గేటు దాటి పోతున్న రామంవేపు చూస్తున్న నా బుగ్గలమీద పడ్డాయి. నా కళ్ళలోకి దూసుకున్నాయి. కళ్ళలో ఏడురంగులు కదిలాయి. తళుక్ మన్నట్లుగా అయింది. ఎంత అందమైనదాన్నో అనుకున్నాను. గర్వంకూడ కలిగింది. గుబురుగాఉన్న అశోకవృక్షం సూర్యకిరణాలు పడి మెరిసిపోతున్నది. ఆఫీసులో అందరూ వెళ్ళిపోయారు. చప్రాసీ తాళాలు సరిచూస్తున్నాడు.

ఎంత అందమైనదాన్నో అనుకున్నాను. వెళ్ళిపోయాడు. ఇక రేపు ఎవరు పొగడుతారు? వందిమాగధులు లేరు.... ఇక అశోక వృక్షం పూలుపూస్తే చూడాలని ఉంది. అది అందమైన ఆడవాళ్ళ తంతే పూస్తుందిట. ఎన్నాళ్ళనుంచో అనుకుంటున్నాను. అంత అహంకారం ఉన్నది నాలో.

ఇంత అతిశయమూ రామం ఇచ్చిపోయిందే నాకు. అవును. ఇంత దుఃఖమూ.

చప్రాసీ వచ్చి అడిగాడు. "ఇంకా ఇక్కడే ఉన్నా వెందుకమ్మా. ఆ బాబుగారు యింకా రాలేదా?" అడిగాడు వాడు. కోపం వచ్చింది.

"ఏ బాబుగారురా నీ బాబుగారు...." పెళుసుగానే అన్నాను.

"ఆరేనండీ, రామారావుగారు. రోజూ వస్తారుకదా. ఇవాళ ఇంకా రాలేదేమానని. తప్పుంటే చమించండి. కాలు మొక్కుతాను" వాడు వెళ్ళిపోయాడు. అశోక వృక్షం పైని సూర్యకిరణాలు భూమిలోకి దిగిపోయినయ్. నేనూ కదిలాను. ఎదురుగా రోడ్డుమీద నిల్చుని ఆ చెట్టుకేసి చూస్తున్నాడు రామం. నన్ను చూడగానే తప్పు చేసిన వాడిలాగా గబగబా అడుగులు ముందుకు వేశాడు. పిలుద్దామనుకున్నాను. గొంతుకలో మాట బైటికి రాదే! అటుకేసీ, ఇటుకేసీ నడుస్తున్న అంతమంది మనుషులమధ్య చప్పట్లు చరచి నేనెలా

పిలవను! అయినా నాకు అతిశయం. అతడు వెళ్ళిపోయాడు. నా అతిశయాన్ని సమూలంగా నాశనంచేసి అతడు వెళ్ళిపోయాడు. వెళ్ళిపోతూ వెళ్ళిపోతూ........

"నిన్నేమని సంబోధించాలో నాకు తెలీటంలేదు. ఈ వుత్తరం మాత్రం చించి అవతల పారేయకు. ఒకవేళ అలా చేసినా పెద్ద నష్టమేమీ లేదనుకో. నాకు అనవసరం. అయినా మానవీయమైన బలహీనతవల్ల ఇలా వ్రాస్తూ సెలవు తీసుకుంటున్నాను.

"నా ప్రాణమైన ప్రాణమూ, ఇవాళ యీ రకంగా జీవితంలో నాకు యేమీలేదని పదేపదే చెప్పుకుంటూ ఎక్కడికి వెళుతున్నానో నాకే తెలియకుండా వెళ్ళటం ఎందు కనుకున్నావు? నిన్ను పొందకుండా బ్రతకలేక. నీకు నే నంటే అవహేళన. నే నెలా భరించగలను? సహించగలను? అందుకనే వెళ్ళిపోతున్నాను. నీమీద నాకు ఏమీ కోపంలేదు. ప్రపంచం చిత్రమైంది. జీవితం చిత్రమైంది. మనుషులు చిత్రమైనవాళ్ళు. నేను నిన్ను ప్రేమించడం ఎంత సహజమో నువు నన్ను ప్రేమించకపోవడంకూడ అంతే సహజమనుకుంటాను. వ్యక్తిగతమైన అభిరుచులూ, కోరికలూ చిత్ర విచిత్రంగా ఉంటాయి. జీవితంలో నిన్ను చూస్తుంటే నువ్వేదో వాంఛిస్తూ దానికోసంగా యెదురు చూస్తున్నా వనిపిస్తున్నది. చాలామంది జీవితంలో ఎదురుచూస్తున్న సుముహూర్తం యెప్పటికీ రాదు. కాని నేను మనసారా కోరుకుంటున్నాను. నువు వాంఛిస్తున్నదానిని పొందవలెనని. నాగురించి యెప్పుడూ నీకు చెప్పలేదు. అంటే నువ్వు చెప్పుకోనివ్వలేదు. ఈ ప్రపంచంలో నా కెవరూలేరు. ఒంటరివాణ్ణి. అనగా వేదాంతి అన్నమాట. ఉన్నతమైన వేదాంతం చెప్పగలిగిన సత్యం అదే కదా! విచిత్రమైన మనస్తత్వం కలవాణ్ణి. ఆర్ద్రమైన హృదయం కలవాణ్ణని చెప్పుకోవటం నాకు నేను అన్యాయం చేసుకున్నట్లు కాదు. నాచుట్టూ బ్రతుకుతున్న అనేకానేకులకన్న హృదయ సంబంధమైన స్పందన యెక్కువ అని చెప్పుకోవటంలో నే నేమీ సిగ్గుపడ

వలసిన పనిలేదు. సరే, అందువల్లనే యీ గాయం ఇక మాన దని పిస్తున్నది.

ఏమిటో, ప్రేమంటే మొదలు మొదలు నాకూ అపహాస్యంగానే ఉండేది. అవహేళనగా ఉండేది. అయినా ఒకరికొకరు పరిచయమయ్యే సన్నివేశాలు యెంత విలువైనవో, యెంత దుష్టమైనవో యెవ్వరూ తెలుసుకోలేరు.

నా జీవితంలోఉన్న వాకే ఒక్క ఆశా! నీతో యేమని చెప్పు కునేను! ఇక్కడ, యీ ప్రపంచంమీద. మానవుని మనుగడని ఆరు లక్షల సంవత్సరాలుగా శాస్త్రజ్ఞులు నిర్ణయిస్తున్నారు. ఇన్నాళ్ళ నుంచీ సృష్టిక్రమం అవిచ్ఛిన్నంగానే సాగుతున్నదా, ఆప్తులు చచ్చి పోయినప్పుడు ఏడుస్తూనే ఉన్నారా? మొట్టమొదటిసారి పెదవులు పెద వులు కలిపి ముద్దుపెట్టుకునేటప్పుడు పరవశత్వం చెందుతూనే వున్నారా మనుష్యులు?ఏమిటి మరి విశేషం?!నిన్ను తలచుకోగానే,నాలో ఆలయంలో దీపం వెలిగినట్లూ, సాయంకాలం మదురు గోడమీద నెమలి పురివిప్పి ఆడినట్లూ, తెల్లని చంద్రకాంత పుష్పాలు వెన్నె లలో మెరిసిపోయినట్లూ అనుభూతి కలుగుతుందేం? నీ కర్థంకాదు. అందుకు నీ తప్పేమున్నది? నా అదృష్టం.

ప్రేమ అనేది యెంత పాతబడిపోయినా, అందులో యేమీ విశేషం లేకపోయినా, ప్రతి వ్యక్తి జీవితంలోనూ దాని స్థానం దానికి ఉంది. విచిత్రమయిన విషయం ఏమిటంటే ఎవరి ప్రేమలోని ఆర్ద్రితా, బరువూ వాళ్ళకుమాత్రమే తెలుస్తుంది. ఎవరి చావు వాళ్ళకు ఎలా భయంకరమైనదో ఎవరి ప్రేమ వాళ్ళకు జ్ఞాతమైనది! అందులోని తీపి, బాధ వాళ్ళకు మాత్రమే తెలుస్తుందన్నమాట.

సరే. ఈ వేదాంతం వదిలేస్తున్నాను.

ఇంక నా హృదయంలో ప్రేమ లేదు. ఈ వున్న కామాన్ని ఎవరికో ఇస్తాను. అందులోనూ ఇంత స్నేహం దొరికితే ఒక రకంగా అదృష్టమేను!

తల్లీ, తండ్రీ, అప్పా, చెల్లెళ్ళూ యెవరూ లేరని చెప్పాను

కదూ. మనుషుల మంచి తనమూ, జాలీ, వాత్సల్యమూ నా తోబుట్టువులు.

ఈ చిన్నమాట వ్రాయటానికి నాకు సిగ్గుగా ఉంది.

నా బాంక్ ఎకౌంట్ నీపేర మార్చాను. నీ ఇష్టమయితే తీసుకో. నిన్ను ప్రాధేయపడటం యీ విషయంలో నాకు లజ్జాకర మైనది. నువ్వు వేరు విధంగా అర్థం చేసుకుంటే నా ఆత్మకుకూడా శాంతి ఉండదు. మనుషులకు కష్టకాలంలో డబ్బు అవసరంగా ఉంటుంది. అంటే నీకు కష్టాలు రావాలని....ఉహూ....అదికాదు. నీ ఇష్టం మరి. నాకేం కోపంలేదు. నీ ఒళ్ళో పడుకుని నీ చిరునవ్వును చూస్తూ ప్రాణాలు వదిలితే బావుండును. తమాషాకు వ్రాస్తున్నాను. కోప్పడకేం!? ఎక్కడో నీ కొక స్నేహితు డున్నాడని ఎప్పుడేనా అనుకో—నీకు పెళ్ళవుతుంది. మీ వారికీ నా శుభాకాంక్షలు. మీ పిల్లలకు నా అంతరాత్మలోనుంచి స్వచ్ఛమైన ఆశీస్సులు.నామంచితనం మీద, నా నిర్మలత్వంమీద ఇంకా నాకు విశ్వాసం పోలేదు. ఇంక ఉంటాను. ఎన్నాళ్ళ తరువాతేనా యెప్పుడేనా యీ వేపుకి వస్తానేమో-అప్పుడు నిన్ను చూస్తాను. యిక—....

రామారావు."

సాయంకాలం ఐదుగంటలైంది. ఆఫీసు వదిలేశారు. జానకి వచ్చి అశోకవృక్షంకింద నిలుచుంది.

ఇది వర్తమానం....

———